


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

| సోమవారం 17 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :76 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## నింబాహేడాలో అటల్ బిహారీ వాజ్‌పేయి 21 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించిన అమిత్ షా



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అమిత్ షా

నింబాహేడా, రాజస్థాన్ — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్ జిల్లా నింబాహేడాలో భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన 21 అడుగుల ఎత్తైన అష్టధాతు విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. జేకే సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ విగ్రహం అటల్ బిహారీ వాజ్‌పేయి మహోన్నత వ్యక్తిత్వం, దేశసేవ, జాతీయవాద ఆలోచనలు, దేశ నిర్మాణానికి ఆయన చేసిన అమూల్యమైన సేవలను నిరంతరం గుర్తుచేసేలా నిలిచిపోతుందని అమిత్ షా పేర్కొన్నారు. అటల్ జీ జర్నలిస్టుగా కలంతో దేశభక్తిని, కవిగా తన రచనల ద్వారా జాతీయ భావాలను, ప్రధానమంత్రిగా దేశ భద్రత, సుపరిపాలనను ముందుకు తీసుకెళ్లారని ఆయన కొనియాడారు. అధికారంలో ఉన్నప్పటికీ, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అటల్ బిహారీ వాజ్‌పేయి సిద్ధాంతాలను విడిచిపెట్టలేదని, అందుకే ఆయనకు దేశవ్యాప్తంగా అపారమైన గౌరవం లభించిందని అమిత్ షా అన్నారు. ఈ సందర్భంగా నింబాహేడాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు కొత్త అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ములుగు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు: సీఎం రేవంత్ రెడ్డి



ములుగు — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: ములుగు నూతన కలెక్టరేట్ సముదాయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సమ్మక్క–సారక్క ఆశీర్వాదంతో ములుగు నుంచే తన పాదయాత్రను ప్రారంభించామని, రాష్ట్రంలోని నలుమూలలా ప్రతి గూడెం, ప్రతి పల్లెకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి భరోసా కల్పించామని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, మంత్రి సీతక్క అక్కగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. మేడారం సమ్మక్క–సారక్క ప్రాంగణాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశామని, ఆడబిడ్డలు, పేదలు, నిరుద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మల్లూరు నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని, జంపన్నవాగును నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీ బిడ్డలు కష్టానికి మారుపేరని, వారి కష్టాలు తీరాలంటే ఈ ప్రాంతానికి సాగునీరు అందాల్సిన అవసరం ఉందని, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఆదివాసీ యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు 12వ తరగతి తర్వాత నైపుణ్య విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నైపుణ్యాలు ఉంటే జపాన్, జర్మనీ వంటి దేశాల్లో కూడా అనేక అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను సారెగా అందించామని, ఈ ఏడాది చిలకపచ్చ రంగు చీరలను అందించబోతున్నామని వెల్లడించారు. రక్తసంబంధం లేకపోయినా మంత్రి సీతక్కను తన ఆడబిడ్డగా గౌరవిస్తున్నానని, మరోవైపు రక్తసంబంధంతో పుట్టిన సోదరిని ఆస్తి కోసం ఇంటి నుంచి పంపించిన వ్యక్తి గురించి, కొడుకుకు బుద్ధి చెప్పాల్సిన తండ్రి ఫామ్‌హౌస్‌లో ఉండటం గురించి ప్రస్తావిస్తూ వారు తెలంగాణ ఆడబిడ్డలకు ఎలా మేలు చేస్తారని ప్రశ్నించారు. అలాగే అఘోరా రావు అఘోరా పూజలు చేస్తూ ప్రజలు ఇబ్బందులు పడాలని కోరుకున్నారని, అయితే దేవుడు తమవైపు ఉన్నాడని, రాష్ట్రంలో వర్షాలు కురిశాయని వ్యాఖ్యానించారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని, తెలంగాణను తెలంగాణ ప్రజలే బాగు చేసుకోవాలని, తమ సమస్యలను తామే పరిష్కరించుకునే విధంగా ఐక్యంగా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఎర్రకోట వేదికగా ప్రతిధ్వనించిన నూతన భారత సామర్థ్య గర్జన

న్యూఢిల్లీ — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: ఎర్రకోట ప్రాకారం నుంచి కేవలం మాటలు మాత్రమే కాకుండా నూతన భారతదేశం సాధించిన అపారమైన పురోగతి, అచంచలమైన ఆత్మవిశ్వాసం ప్రతిధ్వనించిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. స్వదేశీ తయారీ నుంచి డిజిటల్ విప్లవం వరకు భారత్ సాధించిన చారిత్రాత్మక ప్రగతి దేశ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. రక్షణ ఉత్పత్తి నాలుగు రెట్లు పెరగగా, ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తి ఐదు రెట్లు, ఎలక్ట్రానిక్ తయారీ ఏడు రెట్లు, ఆధునిక రైల్వే కోచ్‌ల తయారీ 21 రెట్లు, మొబైల్ ఫోన్ ఉత్పత్తి ఏకంగా 35 రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. ఇదే సమయంలో యూపీఐ ఆధారిత డిజిటల్ లావాదేవీలు 100 రెట్లు పెరగడం భారతదేశం డిజిటల్ రంగంలో సాధించిన విప్లవాత్మక మార్పుకు నిదర్శనంగా నిలిచింది. స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం, ఆధునిక సాంకేతికత వినియోగం, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణతో భారత్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శక్తిగా ముందుకు సాగుతోందని, దేశం ఇక ఆగేది లేదని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

## స్వర్ణాంధ్ర సాధనకు ప్రతి ఆంధ్రుడు సంకల్పం చేయాలి: సీఎం చంద్రబాబు







అమరావతి — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: స్త్రీశక్తి పథకం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తూ వారితో ముఖాముఖి నిర్వహించి పథకం ద్వారా మహిళలకు అందుతున్న ప్రయోజనాలు, వారి అనుభవాలను తెలుసుకున్నారు. అనంతరం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఆవిష్కరించి, 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనకు ప్రతి ఆంధ్రుడు సంకల్పం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, యువతకు అవకాశాలు, మహిళల సాధికారతతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగి స్వర్ణాంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. విజయవాడలోని లోక్ భవన్‌లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు హాజరుకాగా, గవర్నర్ దంపతులు వారిని ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం గవర్నర్ దంపతులు అతిథులకు తేనేటి విందు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, పలాసలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన దానయ్య కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు పార్టీ తరఫున రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక ఐక్యత, మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు.




## స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శక ప్రజా పంపిణీ వ్యవస్థకు మరో ముందడుగు: మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్

హైదరాబాద్ — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: అర్హులైన ప్రతి కుటుంబానికి ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలను పారదర్శకంగా, సమర్థవంతంగా, సకాలంలో అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మైనారిటీస్ వెల్ఫేర్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంలో స్మార్ట్ రేషన్ కార్డులు కీలక ముందడుగు అని పేర్కొన్నారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులు తమ రేషన్ కార్డు వివరాలను సులభంగా వెంట తీసుకెళ్లి అవసరమైన సమయంలో వినియోగించుకోవచ్చని, పాత రేషన్ పుస్తకాలతో ఎదురయ్యే ఇబ్బందులను డిజిటలైజేషన్ ద్వారా తగ్గించవచ్చని తెలిపారు. ప్రజా సంక్షేమంపై దూరదృష్టి, నిబద్ధతతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ప్రయోజనాలు నేరుగా, పారదర్శకంగా, ఎలాంటి అనవసర ఇబ్బందులు లేకుండా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, మిగిలిన హామీలను కూడా దశలవారీగా అమలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, రేషన్ కార్డుల పరిధిని విస్తరించడం, నాణ్యమైన సన్నబియ్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్న పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కృషిని అభినందించారు. తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకున్న అజారుద్దీన్ గతంలో రేషన్ సరుకులు పొందడంలో, పాత రేషన్ పుస్తకాలను నిర్వహించడంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రస్తుతం సాంకేతికత అందుబాటులోకి రావడంతో జేబులో లేదా పర్సులో సులభంగా పెట్టుకునే స్మార్ట్ కార్డు ద్వారా ప్రక్రియ మరింత సులభంగా, పారదర్శకంగా మారుతోందని అన్నారు. అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. లబ్ధిదారులకు సాధ్యమైనంత వరకు వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, గతంలో కొంతమంది లబ్ధిదారులకు నివాస ప్రాంతాలకు దూరంగా ఇళ్లు కేటాయించడం వల్ల ఉపాధి అవకాశాలు, కుటుంబ సంబంధాలపై ప్రభావం పడేదని పేర్కొన్నారు. కొత్త విధానంలో అర్హులైన లబ్ధిదారులు నివసించే ప్రాంతాల్లోనే అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి స్థానికంగానే గృహాలు అందించేందుకు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని మంత్రి అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల భవిష్యత్తుకు విద్యే అత్యంత ముఖ్యమైన పెట్టుబడి అని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. మైనారిటీలు, ఇతర వర్గాలకు సంబంధించిన నిజమైన సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చినప్పుడు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి అర్హుడైన పౌరుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడటమే తమ ప్రధాన ప్రాధాన్యత అని, ప్రజల సమస్యలను వింటూ వాటిని అర్థం చేసుకుని పరిష్కారాల కోసం నిరంతరం కృషి చేస్తామని మంత్రి తెలిపారు. లబ్ధిదారులు స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు కోదండరాం, మీర్జా రహ్మత్ బేగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫికార్ అలీ, కౌసర్ మొహియుద్దీన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, శ్రీనగర్ కాలనీ ఎమ్మెల్యే గణేష్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ రాజి రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌తో పాటు పౌర సరఫరాల శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




# సమ్మక్క-సారలమ్మ గద్దెలను దర్శించుకున్న మంత్రి పొంగులేటి

మేడారం — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మేడారంలోని శ్రీ సమ్మక్క-సారలమ్మ గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన మంత్రి రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మేడారం సమ్మక్క-సారలమ్మల పుణ్యక్షేత్రం తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని, అమ్మవార్ల ఆశీస్సులతో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి సీతక్క, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై ఆరోపణలను ఖండిస్తూ విజయవాడలో ఉపాధ్యాయుల ఆత్మగౌరవ ర్యాలీ







విజయవాడ — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: మెగా డీఎస్సీ-2025 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల ప్రతిభ, కష్టాన్ని అవమానించేలా వైఎస్సార్‌సీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ వేలాది మంది ఉపాధ్యాయులు విజయవాడలో ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివి, ప్రతిభ ఆధారంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన తమపై రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ-2025లో 16 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉద్యోగాలు సాధించారని, కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నియామక ప్రక్రియ నిర్వహించి వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిందని వారు పేర్కొన్నారు. డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారం మానుకోవాలని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చినా ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయలేదని ఉపాధ్యాయులు విమర్శించారు. ప్రస్తుతం మెగా డీఎస్సీ ద్వారా తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన వారిని అవమానించేలా ప్రచారం చేయడం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేస్తున్న వారు వాటికి ఆధారాలు చూపాలని, పదేపదే అబద్ధాలు చెబితే అవి నిజాలు కావని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం 16 వేల మందికి పైగా ఉపాధ్యాయుల కష్టం, ప్రతిభపై విష ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. "మేము పాఠాలు చెప్పే ఉపాధ్యాయులం.. మా ప్రతిభను అవమానించే తప్పుడు ఆరోపణలకు తగిన సమాధానం చెబుతాం" అంటూ నిరసనకారులు హెచ్చరించారు. చలో విజయవాడ పేరుతో నిర్వహించిన ఈ భారీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారాన్ని నిలిపివేయాలని కోరారు.

# చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలి: పవన్ కళ్యాణ్

చంద్రగిరి — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: చంద్రగిరి సమీప ప్రాంతాల్లో ఏనుగుల సంచారం నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఏనుగుల కదలికలపై డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని, అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో రాత్రివేళ గస్తీని పెంచాలని సూచించారు. ఏనుగుల సంచారానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు రెవెన్యూ, పోలీసు, అటవీశాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ఏనుగుల కదలికలను గుర్తించిన వెంటనే సంబంధిత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని, ముఖ్యంగా 'హనుమాన్ బృందాల'ను మోహరించి అటవీ సమీప గ్రామాల్లో పర్యవేక్షణ, ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. అటవీ ప్రాంతాలకు సమీపంలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులను రెచ్చగొట్టడం లేదా వాటి సమీపానికి వెళ్లడం వంటి చర్యలకు పాల్పడకుండా అధికారుల సూచనలు పాటించాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

# స్త్రీ శక్తి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య 24 లక్షలకు పెరుగుదల



అమరావతి — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న స్త్రీ శక్తి పథకం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతోందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. స్త్రీ శక్తి పథకం అమలవుతున్న బస్సుల్లో మహిళల ఆక్యుపెన్సీ 40 శాతం నుంచి 62 శాతానికి పెరగగా, రోజువారీ మహిళా ప్రయాణికుల సంఖ్య 9.47 లక్షల నుంచి ఏకంగా 24 లక్షలకు చేరిందని వెల్లడించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా ఉద్యోగాలు, విద్య, వైద్యం, వ్యాపారం, ఇతర అవసరాల కోసం వారు మరింత స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశం ఏర్పడిందని ప్రభుత్వం పేర్కొంది. ఈ పథకం మహిళలకు ఎంతగా ఉపయోగపడుతుందో గణాంకాలతో పాటు మహిళల నోటివెంట స్వయంగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారితో కలిసి బస్సులో ప్రయాణించారు. ప్రయాణ సమయంలో మహిళలతో ముఖాముఖిగా మాట్లాడి స్త్రీ శక్తి పథకం ద్వారా వారికి కలుగుతున్న ప్రయోజనాలు, ఎదురవుతున్న సమస్యలు, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అనుభవాలను నేరుగా తెలుసుకుని సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

# సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన గౌతు లచ్చన్న: పవన్ కళ్యాణ్

ఆంధ్రప్రదేశ్ — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: స్వాతంత్ర్య సమరయోధుడిగా, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ప్రజా నాయకుడిగా, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు శ్రీ గౌతు లచ్చన్న అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొనియాడారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించిన పవన్ కళ్యాణ్, అణగారిన వర్గాల గొంతుకగా నిలిచిన లచ్చన్న సమాజంలో సమానత్వం కోసం నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ప్రజా హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం గౌతు లచ్చన్న చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పవన్ కళ్యాణ్ అన్నారు.



# వివాహ వేడుకల్లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

హైదరాబాద్ — తెలంగాణ బ్యూరో ప్రతినిధి — ఆగస్టు 17: తెలుగు సినీ నిర్మాత బండ్ల గణేష్ కుమార్తె వివాహ వేడుకకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న గవర్నర్ నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొంపల్లిలోని ఆస్పిషియస్ కన్వెన్షన్ సెంటర్‌లో డాక్టర్ బి. కళ్యాణ్ చక్రవర్తి కుమారుడు చిరంజీవి అభయ్ చక్రవర్తి-సురక్షితల వివాహ వేడుకకు గవర్నర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా ఉత్తరప్రదేశ్ స్టాంపులు, కోర్టు ఫీజులు, రిజిస్ట్రేషన్ శాఖల సహాయ మంత్రి రవీంద్ర జైస్వాల్ ఆదివారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

# శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా వరద

శ్రీశైలం — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జలాశయానికి 6,738 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా, వివిధ మార్గాల ద్వారా 14,126 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 877.60 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 175.5138 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం కుడి జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోగా, ఎడమ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. జలాశయానికి వస్తున్న వరద ప్రవాహం, నీటి నిల్వ, దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## డాక్టర్ ప్రియాంక హత్యకేసు దర్యాప్తు అధికారిగా పాటిల్ దేవరాజు

అమరావతి — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: డాక్టర్ ప్రియాంక హత్యకేసు దర్యాప్తు బాధ్యతలను ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజుకు అప్పగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పాటిల్ దేవరాజును ఈ కేసుకు దర్యాప్తు అధికారిగా నియమించింది. కేసు దర్యాప్తును సమగ్రంగా నిర్వహించి, హత్యకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. కేసులో లభించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, సంఘటనకు సంబంధించిన ఇతర కీలక అంశాలను పరిశీలిస్తూ దర్యాప్తును ముందుకు తీసుకెళ్లనున్నారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు కేసులోని అన్ని అంశాలను నిశితంగా పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



## ఆకుపాముల వద్ద రెండు బస్సులు ఢీ.. పలువురికి గాయాలు

సూర్యాపేట — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: సూర్యాపేట జిల్లాలోని ఆకుపాముల సమీపంలో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై రెండు బస్సులు ఢీకొన్న ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ముందు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాద సమయంలో రెండు బస్సుల్లో కలిపి 63 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఢీకొన్న తీవ్రతకు ఆర్టీసీ బస్సు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో పోలీసులు సహాయక చర్యలు చేపట్టి అతడిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ప్రమాదంలో గాయపడిన పలువురు ప్రయాణికులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించినట్లు సమాచారం. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం కారణంగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



## హైదరాబాద్ జిల్లా నుంచి టీఆర్పీలో భారీగా చేరికలు

హైదరాబాద్ — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: హైదరాబాద్ జిల్లా నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)లో చేరారు. హైదరాబాద్ ఇన్‌చార్జ్ భావన వెంకటేష్, హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. కిషోర్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రామ్‌నగర్‌కు చెందిన సాయిరాం, సీతాఫల్‌మండికి చెందిన శ్రీనివాస్ చారి, కవాడిగూడకు చెందిన ప్రజాపతి, వినయ్, ఖైరతాబాద్‌కు చెందిన రవికుమార్ టీఆర్పీలో చేరారు. టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజల కోసం, బీసీల రాజ్యాధికారం కోసం టీఆర్పీ చేస్తున్న పోరాటానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు టీఆర్పీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తీన్మార్ మల్లన్న సూచించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ జిల్లాలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు మరింత చేరువ కావాలని నాయకులకు సూచించారు.

## జగిత్యాల జిల్లా నుంచి టీఆర్పీలో భారీగా చేరికలు



జగిత్యాల — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)కి ప్రజల మద్దతు పెరుగుతుండటంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్పీలో చేరుతున్నారు. తాజాగా జగిత్యాల జిల్లా నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు టీఆర్పీలో చేరారు. బీసీలకు రాజ్యాధికారం సాధించాలనే పార్టీ లక్ష్యం, టీఆర్పీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. జగిత్యాల జిల్లా టీఆర్పీ అధ్యక్షుడు సాయిని పాపన్న ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా సముచిత వాటా, రాజ్యాధికారం దక్కాలంటే ప్రజలంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. టీఆర్పీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జగిత్యాల జిల్లాలో టీఆర్పీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు తాజా చేరికలే నిదర్శనమని జిల్లా అధ్యక్షుడు సాయిని పాపన్న తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లాలో పార్టీని మరింత విస్తరించి, బీసీల రాజ్యాధికార లక్ష్య సాధన కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఆర్పీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సోషల్ మీడియానే మన ఆయుధం.. ప్రతి పోస్ట్ బీసీల్లో చైతన్యం నింపాలి: తీన్మార్ మల్లన్న

హైదరాబాద్ — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: తెలంగాణ రాజ్యాధికార పార్టీ విస్తరణలో సోషల్ మీడియా విభాగం కీలక పాత్ర పోషించాలని పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని టీఆర్పీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఆకుల మనోజ్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా వారియర్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియానే తమ ఆయుధమని, ప్రతి పోస్ట్ బీసీల్లో చైతన్యం నింపేలా ఉండాలని మల్లన్న స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలు, బీసీల రాజ్యాధికార లక్ష్యం, ప్రజా సమస్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సోషల్ మీడియా కార్యకర్తలపై ఉందన్నారు. సోషల్ మీడియా విభాగం పార్టీకి ఇంధనం లాంటిదని, ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేస్తే పార్టీని క్షేత్రస్థాయి వరకు మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి మండలంలో సోషల్ మీడియా బృందాలను ఏర్పాటు చేసి గ్రామస్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. కేవలం పోస్టులు చేయడానికే పరిమితం కాకుండా ప్రజల సమస్యలను గుర్తించి, వాటిపై అవగాహన కల్పించే వేదికగా సోషల్ మీడియాను వినియోగించుకోవాలని అన్నారు. ప్రతి పోస్ట్ ఒక ఉద్యమానికి బీజం కావాలని, ప్రతి వీడియో బీసీల్లో చైతన్యాన్ని రగిలించేలా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. సోషల్ మీడియా వారియర్స్‌కు పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని మల్లన్న భరోసా ఇచ్చారు. కార్యకర్తలను ఎవరైనా ఇబ్బంది పెడితే పార్టీ అండగా నిలుస్తుందని, అవసరమైతే తాను స్వయంగా రంగంలోకి దిగుతానని తెలిపారు. సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు, బెదిరింపులు, వేధింపులు ఎదురైతే వారికి న్యాయపరమైన రక్షణ కల్పించేందుకు బలమైన న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు న్యాయ విభాగం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీసీల రాజ్యాధికారం, సామాజిక న్యాయం లక్ష్యంగా సెప్టెంబర్ 17 నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు మల్లన్న వెల్లడించారు. పాదయాత్రతో పాటు పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఆకుల మనోజ్ మాట్లాడుతూ పార్టీ అధినేత ఇచ్చిన దిశానిర్దేశంతో మండల, నియోజకవర్గ స్థాయిల్లో సోషల్ మీడియా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా సాత్ కన్వీనర్ మార్తా శ్రీనివాస్, ఉమ్మడి జిల్లాల కన్వీనర్లు హర్ష, శ్రీకాంత్, సత్యనారాయణ రాజు, సాయి చరణ్ పటేల్, నాంపల్లి జగన్, లతీఫ్‌తో పాటు వివిధ జిల్లాల కన్వీనర్లు, సోషల్ మీడియా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ములుగు నుంచి గ్రామీణ రహదారుల అభివృద్ధికి తొలి అడుగు

ములుగు — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు, ప్రధాన రహదారులకు మెరుగైన అనుసంధానం కల్పిస్తూ తెలంగాణ గ్రామీణ రవాణా రంగంలో కొత్త అధ్యాయానికి ములుగు జిల్లా నుంచి తొలి అడుగు పడింది. ములుగు జిల్లా కేంద్రంగా రూ.16,007 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ రహదారి అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి, తొలిదశలో రూ.6,294.81 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో 7,448 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ములుగు జిల్లా నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన కలెక్టరేట్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ములుగు జిల్లాలో రూ.868 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల రాకపోకలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు మరింత మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

## జూరాల ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

జూరాల — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 24 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, వివిధ మార్గాల ద్వారా 20,705 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 318.29 మీటర్ల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది. జూరాల జలాశయంలోకి వస్తున్న వరద ప్రవాహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టులోని ఆరు విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ద్వారా మొత్తం 237 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

# డీఎస్సీ డైవర్షన్ కోసమే గ్రూప్-1పై అనవసర రాద్ధాంతం

అమరావతి — సందేశం టైమ్స్ ప్రతినిధి — ఆగస్టు 17: మెగా డీఎస్సీపై యువత, అభ్యర్థులు ప్రశ్నలు లేవనెత్తుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకే గ్రూప్-1 నియామకాలపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ వర్గాలు ఆరోపించాయి. కోర్టు పర్యవేక్షణలో జరిగిన గ్రూప్-1 నియామక ప్రక్రియను వివాదాస్పదం చేసేందుకు అభూతకల్పనలను ప్రచారం చేస్తున్నారని విమర్శించాయి. కొవిడ్ పరిస్థితుల నేపథ్యంలో డిజిటల్ మూల్యాంకన విధానాన్ని అనుసరించినప్పటికీ, ఆ ఫలితాలు వెలువడలేదని, ఆ ప్రక్రియ ద్వారా ఒక్కరికీ ఉద్యోగం కూడా ఇవ్వలేదని పేర్కొన్నాయి. హాయ్‌ల్యాండ్‌లో అసలు మూల్యాంకనం జరగలేదని అప్పటి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌నే హైకోర్టుకు సమర్పించిన కౌంటర్‌లో స్పష్టం చేసిందని తెలిపాయి. అనంతరం హైకోర్టు ఆదేశాల మేరకు అత్యున్నత ప్రమాణాలతో మాన్యువల్ మూల్యాంకనం నిర్వహించి, దాని ఆధారంగానే ఫలితాలు, తుది ఎంపికలు చేపట్టారని పేర్కొన్నాయి. ఎంపికైన అభ్యర్థుల విద్యా, ఉద్యోగ నేపథ్యాలను పరిశీలిస్తే పరీక్షలు ఎంత పారదర్శకంగా జరిగాయో అర్థమవుతుందని వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి. తమ ప్రభుత్వ హయాంలో ప్రతిభకు ప్రాధాన్యం ఇచ్చామని, అక్రమాలకు ఎలాంటి అవకాశం కల్పించలేదని పేర్కొన్నాయి. గ్రూప్-1 ఇంటర్వ్యూల కోసం అత్యున్నత స్థాయి అధికారులతో మూడు ఇంటర్వ్యూ బోర్డులు ఏర్పాటు చేశామని, విశ్వవిద్యాలయాల ఉపకులపతులకు కూడా ఇంటర్వ్యూ బోర్డుల్లో స్థానం కల్పించామని వివరించాయి. ఎవరికీ అనుచిత ప్రయోజనం కల్పించలేదని, మెరిట్ ఆధారంగానే ఎంపికలు జరిగాయని ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికలో స్పష్టమైందని పేర్కొన్నాయి. ఒకవైపు కోర్టు పర్యవేక్షణలో నియామక ప్రక్రియ కొనసాగగా, మరోవైపు ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికలో అక్రమాలకు ఆధారాలు లేవని పేర్కొన్నప్పటికీ గ్రూప్-1ను రాజకీయ వివాదంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించాయి. మెగా డీఎస్సీ అంశంపై యువత నుంచి వస్తున్న ప్రశ్నలను పక్కదారి పట్టించేందుకు అధికార కూటమి, అనుకూల మీడియా కలిసి గ్రూప్-1 అంశాన్ని తెరపైకి తెస్తున్నాయని వైఎస్సార్‌సీపీ వర్గాలు విమర్శించాయి.



## అమెరికాలో వరుస కాల్పులు.. మిషిగన్‌లో ఐదుగురు మృతి, వర్జీనియా విశ్వవిద్యాలయంలో ఐదుగురికి గాయాలు

అమెరికా, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు కలకలం రేపాయి. మిషిగన్‌లోని మిస్సాకీ కౌంటీలో జరిగిన వరుస కాల్పుల్లో ఐదుగురు మృతి చెందగా, అనుమానిత షూటర్ 39 ఏళ్ల చాడ్ హిక్‌మన్ కూడా మృతిచెందాడు. మూడు వేర్వేరు ప్రాంతాల్లో కాల్పులు జరిగినట్లు అధికారులు తెలిపారు. తొలుత ఓ ఇంట్లో ముగ్గురు మృతదేహాలు, తీవ్రంగా గాయపడిన 13 ఏళ్ల బాలికను గుర్తించిన పోలీసులు, అనంతరం మరో ప్రాంతంలో నాలుగో మృతదేహాన్ని గుర్తించారు. చివరికి అడవుల్లో ఓ మహిళ మృతదేహంతో పాటు అనుమానితుడి మృతదేహాన్ని గుర్తించారు. హిక్‌మన్‌కు గతంలో నేర చరిత్ర ఉండగా, 2024లో బాలలపై దాడికి సంబంధించిన కేసులో దోషిగా తేలి జైలు శిక్ష అనుభవించినట్లు కోర్టు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఇదే సమయంలో వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలోనూ కాల్పుల ఘటన చోటుచేసుకుని ఐదుగురు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి 19 ఏళ్ల అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తాజా సమాచారం. [illegible]లో చోటుచేసుకున్న ఈ వరుస కాల్పుల ఘటనలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పరకాలలో రూ.200 కోట్ల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన

పరకాల, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాలలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు రూ.82 కోట్లతో పరకాల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, రూ.65 కోట్లతో పరకాల-ఎర్రగుట్ట నాలుగు లేన్ల రహదారి, రూ.45.15 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, రూ.32.17 కోట్లతో ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అక్కంపేట గ్రామంలో రూ.10 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్ల పనులకు కూడా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం మహిళలు, నిరుద్యోగులు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వంలో మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రివర్గంలో స్థానం కల్పించామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ దశలవారీగా భర్తీ చేస్తామని, నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నాలను ప్రజలు నమ్మవద్దని అన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయాన్ని తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని, రామప్ప, వేయి స్తంభాల ఆలయాలతో పోటీపడేలా అభివృద్ధి చేస్తామని, జంపన్న వాగును కూడా అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వాలు మేడారం ఆలయాన్ని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. బతుకమ్మ చీరల పంపిణీపై కూడా గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, ఈ ఏడాది డిసెంబర్‌లో ఆడబిడ్డలకు చిలకపచ్చ రంగు చీరలు అందిస్తామని వెల్లడించారు. [illegible]లో కరువు రావాలని కొందరు ఇతర రాష్ట్రాలకు వెళ్లి అఘోర, క్షుద్రపూజలు చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు.

## పటాన్‌చెరులో గుర్తుతెలియని వ్యక్తి మృతి



పటాన్‌చెరు, సందేశం టైమ్స్ బి. డేవిడ్: ఆగస్టు 17 — పటాన్‌చెరు మండల పరిధిలోని ఎంజీ రోడ్డులో మహంకాళి అమ్మవారి ఆలయం సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతుడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు, మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## గౌతు లచ్చన్న, వాజపేయి సేవలు చిరస్మరణీయం





అమరావతి, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — దేశానికి స్వాతంత్య్రం రాకముందు, వచ్చిన తర్వాత కూడా తెలుగునాట రాజకీయాలను ప్రభావితం చేసిన సర్దార్ గౌతు లచ్చన్న, మాజీ ప్రధాని భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజపేయి దేశానికి, ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా బలహీన వర్గాల సంక్షేమం, రైతుల హక్కుల కోసం జీవితాంతం ఉద్యమించిన సేనాని గౌతు లచ్చన్న అని కొనియాడారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆయన చేసిన ప్రజా ఉద్యమాలను, సేవలను స్మరించుకుంటూ మహనీయుని స్మృతికి ఘనంగా నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా దేశభక్తి, దూరదృష్టి, హుందాతనానికి ప్రతీకగా నిలిచిన అటల్ బిహారీ వాజపేయి 'దేశమే ప్రథమం' అనే భావనతో జీవితాంతం దేశ సేవకు అంకితమైన మహానేత అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వాజపేయి అందించిన సహకారం తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని చంద్రబాబు అన్నారు. వాజపేయి వర్ధంతి సందర్భంగా ఆ మహానేతకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.



## విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సందేశం టైమ్స్ బి. డేవిడ్: ఆగస్టు 17 — పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని ఇసుక బావి కాలనీలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవత, శివలింగ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వం, తన వంతు నుంచి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం తులసివనం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్, యూనిస్‌తో పాటు కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

## మెదక్ కలెక్టరేట్‌లో రేపు ప్రజావాణి రద్దు



మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణి హాల్‌లో ఆగస్టు 17న మధ్యాహ్నం 12.30 గంటలకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం జిల్లా అధికారులు తమకు కేటాయించిన విధుల్లో నిమగ్నమై ఉండనున్నందున కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని రద్దు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అయితే ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ యథావిధిగా కొనసాగుతుందని, మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు కూడా ఎప్పటిలాగే నిర్వహించబడతాయని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, మండల స్థాయిలో ప్రజావాణి సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.

## అమరావతిలో ఐకానిక్ భవనాలు.. గ్రాఫిక్స్ అన్నవారికి సమాధానం: సీఎం చంద్రబాబు



అమరావతి, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — రాజధాని అమరావతిలో నిర్మాణం కానున్న అసెంబ్లీ, హైకోర్టు, అడ్మినిస్ట్రేటివ్ టవర్స్ వంటి ఐకానిక్ భవనాలను గతంలో కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రస్తుతం ఒక్కో ఐకానిక్ టవర్ వాస్తవ రూపం దాల్చి కళ్లెదుట నిలుస్తుంటే, అప్పట్లో విమర్శలు చేసిన వారి పరిస్థితి ఏమవుతుందో అంటూ వ్యాఖ్యానించారు. అమరావతి అభివృద్ధి ఆగదని, రాజధాని నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తామని సీఎం స్పష్టం చేశారు.




## తెలంగాణ జిమ్నాస్టిక్స్ అభివృద్ధిపై కార్యవర్గ సమావేశం

మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావుతో కలిసి తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నట్లు భారతీయ జనతా యువ మోర్చా నాయకులు అర్వింద్ వాల్దాస్ తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్‌గా వై. రవీందర్‌ను, అసోసియేట్ జాయింట్ సెక్రెటరీలుగా వంశీకృష్ణ, ముస్తఫాను నామినేట్ చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జిమ్నాస్టిక్స్ క్రీడను మరింత అభివృద్ధి చేయడం, యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించడం, జిల్లా స్థాయిలో జిమ్నాస్టిక్స్ అకాడమీలను బలోపేతం చేయడం, క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు అర్వింద్ వాల్దాస్ తెలిపారు.




## మధిర ప్రతిష్టను దిగజారుస్తున్న భట్టి విక్రమార్క లింగాల కమల్ రాజు

మధిర, సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జ్ శెట్టి సురేష్: ఆగస్టు 17 — మధిర బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర స్థాయిలో మధిర ప్రతిష్టను దిగజార్చే విధంగా పాలన సాగుతోందని ఆరోపించారు. కమిషన్ల కుటుంబానికి మధిర అడ్డాగా మారడం దౌర్భాగ్యకరమని వ్యాఖ్యానించారు. అభివృద్ధి పేరుతో మధిర పట్టణ వ్యాపార రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని, రోడ్ల విస్తరణ పేరుతో జరుగుతున్న చర్యల వల్ల వ్యాపార వర్గాలపై పెనుభారం పడుతోందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వల్ల భట్టి విక్రమార్కకు కమిషన్లు తప్ప మధిర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం రైతుల భూములను అడ్డగోలుగా తీసుకుంటే సహించబోమని హెచ్చరించారు. భట్టి విక్రమార్క కమిషన్ల మంత్రిగా వ్యవహరిస్తూ దళిత జాతి పరువు తీస్తున్నారని విమర్శించారు. ఒక మంత్రి భార్య అవినీతిపై రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ పేరుతో చర్యలు తీసుకుంటున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం అడ్డుగా ఉన్నప్పటికీ అక్కడ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని కూడా తామే చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని లింగాల కమల్ రాజు తీవ్రంగా విమర్శించారు.



## నర్సాపూర్ నుంచి యాదగిరిగుట్టకు నూతన బస్సు సర్వీస్

మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — నర్సాపూర్ పట్టణ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శుభవార్త అందించింది. యాదగిరిగుట్టకు వెళ్లే భక్తులు, ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సాపూర్ డిపో ఆధ్వర్యంలో నర్సాపూర్ నుంచి యాదగిరిగుట్ట వరకు నూతన బస్సు సర్వీసును ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నూతన బస్సు సర్వీస్ ఆగస్టు 17 నుంచి ప్రతిరోజూ అందుబాటులోకి రానుంది. నర్సాపూర్ బస్‌స్టేషన్ నుంచి ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు బస్సు బయలుదేరి మంగళపర్తి, వెల్దుర్తి, తూప్రాన్, గజ్వేల్, భువనగిరి మీదుగా యాదగిరిగుట్టకు చేరుకోనుంది. ఈ మార్గంలోని వివిధ ప్రాంతాల ప్రయాణికులు, యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ఈ నూతన సర్వీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు. నర్సాపూర్ నుంచి నేరుగా యాదగిరిగుట్టకు బస్సు సౌకర్యం కల్పించడంతో భక్తులు, ప్రయాణికులు ఇతర ప్రాంతాల్లో బస్సులు మారాల్సిన ఇబ్బందులు లేకుండా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ నూతన బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా రాయిని శివచందర్



రాంసాన్‌పల్లి, సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి: ఆగస్టు 17 — సంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు రాయిని శివచందర్ నియామకం కావడం పట్ల గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివచందర్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన ఓబీసీల సమస్యల పరిష్కారానికి, వారి హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. రాంసాన్‌పల్లి గ్రామానికి చెందిన శివచందర్‌కు జిల్లా స్థాయిలో బాధ్యతలు లభించడం గ్రామానికి గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఓబీసీ మోర్చా బలోపేతానికి, ఓబీసీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాయిని శివచందర్ తెలిపారు.



## భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకోవాలి

సూర్యాపేట, సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: ఆగస్టు 17 — సూర్యాపేట పట్టణ ప్రజలు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీ పిలుపునిచ్చారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్ వెలుగు వెంకన్న నివాసం నుంచి కోట మైసమ్మ అమ్మవారికి సమర్పించే పట్టు వస్త్రాల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



## నాగేశ్ షెట్కార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మహమ్మద్ తన్వీర్

నారాయణఖేడ్, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: ఆగస్టు 17 — జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ సోదరుడు నాగేశ్ షెట్కార్ జన్మదినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ నారాయణఖేడ్ పట్టణంలోని నాగేశ్ షెట్కార్ నివాసానికి వెళ్లి ఆయనను ఆత్మీయంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ తన్వీర్ మాట్లాడుతూ నాగేశ్ షెట్కార్ ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలతో మరింత ఆత్మీయ అనుబంధాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుతుబుద్దీన్ తాజోద్దీన్, కోహీర్ మున్సిపల్ వైస్ చైర్మన్ హనాన్ జావిద్, కాంగ్రెస్ పార్టీ కోహీర్ పట్టణ అధ్యక్షుడు ముజఫర్, కోహీర్ వైస్ ఎంపీపీ షాకీర్ యూసుఫ్ పటేల్ తదితరులు పాల్గొని నాగేశ్ షెట్కార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ – తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టులకు ఆహ్వానం

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ జాతీయ ప్రతినిధి: ఆగస్టు 17 — జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (TJWA) ముందుకు సాగుతోందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. “జర్నలిస్ట్ శక్తి ప్రజల పక్షం – జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే మా ధ్యేయం” అనే నినాదంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు, వెబ్ మీడియా, డిజిటల్ మీడియా, న్యూస్ పోర్టల్స్, యూట్యూబ్ న్యూస్ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు, రిపోర్టర్లు, ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు, డిజిటల్ మీడియా ప్రతినిధులు, ఫ్రీలాన్స్ జర్నలిస్టులందరికీ తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ ఆహ్వానం పలుకుతోంది. తెలంగాణ సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్–2001 కింద రిజిస్ట్రేషన్ నంబర్ 288/2026తో 15 జూన్ 2026న నమోదైన తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్, జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు అండగా నిలవడం, వృత్తిపరమైన అభివృద్ధికి సహకరించడం, సంక్షేమ కార్యక్రమాలను విస్తరించడం వంటి లక్ష్యాలతో పనిచేస్తోందని పేర్కొంది. “జర్నలిస్ట్ హక్కు – సమాజ హక్కు, జర్నలిస్ట్ బలం – ప్రజల బలం” అనే భావనతో ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమైన జర్నలిజం రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అసోసియేషన్ తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చిన్న, పెద్ద పత్రికలు, ప్రాంతీయ పత్రికలు, జాతీయ స్థాయి మీడియా సంస్థలు, వెబ్ ఛానళ్లు, యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, గుర్తింపు, భద్రత, సంక్షేమం, అవకాశాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై సంఘం తరఫున సాధ్యమైనంత మేరకు కృషి చేయనున్నట్లు వెల్లడించింది. జర్నలిస్టులు ఒక్కొక్కరిగా కాకుండా ఒకే వేదికపైకి వచ్చి తమ హక్కులు, సమస్యలు, సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని TJWA పిలుపునిచ్చింది. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే దిశగా అసోసియేషన్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే సంఘానికి అధ్యక్షుడిగా షెట్టి అశోక్, ఉపాధ్యక్షురాలిగా వట్టికూటి భవాని, ప్రధాన కార్యదర్శిగా షెట్టి వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా తమ్మలి సంగమేశ్వర్, కోశాధికారిగా కేస్ అమృతతో పాటు కార్యవర్గ సభ్యులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టు ఈ వేదికతో అనుసంధానం కావాలని, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభ్యున్నతి కోసం కలిసి పనిచేయాలని తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. జర్నలిస్టుల వృత్తి గౌరవాన్ని కాపాడుతూ, వారి సమస్యలను సమాజం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘటితంగా కృషి చేస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. “జర్నలిస్టుల అభ్యున్నతికి... హక్కుల పరిరక్షణకు... సంక్షేమానికి మేమంతా ఒక్కటే” అనే నినాదంతో ప్రతి జర్నలిస్టుకు అండగా నిలిచే బలమైన సంక్షేమ వేదికగా తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని వారు కోరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ పత్రికలు, మీడియా సంస్థలు, వెబ్ ఛానళ్లు, యూట్యూబ్ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు TJWAతో కలిసి జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ముందుకు రావాలని అసోసియేషన్ ఆహ్వానం పలికింది.



# పరకాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి

పరకాల, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — వరంగల్ జిల్లా పరకాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, ఇప్పటికే పూర్తయిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ.82 కోట్లతో పరకాల మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులు, రూ.65 కోట్లతో పరకాల నుంచి ఎర్రగట్టుగుట్ట వరకు నాలుగు లేన్ల రహదారి, రూ.45.15 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, రూ.32.17 కోట్ల అంచనా వ్యయంతో దామెర మండలం ల్యాదేళ్లలో పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్, రూ.10 కోట్లతో అక్కంపేట గ్రామ అభివృద్ధి ప్రణాళిక పనులు, రూ.5 కోట్లతో శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులు, ఆత్మకూర్‌లో టౌన్‌షిప్ అండర్ ల్యాండ్ పూలింగ్ స్కీమ్, రూ.3 కోట్లతో పరకాల పట్టణంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, రూ.1.10 కోట్లతో విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అలాగే పరకాలలో రూ.35 కోట్లతో నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రి, ఆత్మకూర్‌లో రూ.1 కోట్లతో నిర్మించిన అధునాతన ఎస్‌పీఎం సెంటర్, పరకాలలో రూ.5 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం పరకాలలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి బాట బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర, చైతన్యం ఉందని, పాలకుల అణచివేతకు గురైన ప్రతిసారీ ఈ గడ్డ తన చైతన్యాన్ని ప్రదర్శించిందని అన్నారు. ఇచ్చిన మాట తప్పకూడదనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం రోజుకు 18 గంటలు పనిచేస్తోందని తెలిపారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాల ద్వారా రైతులను రాజులను చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, రెండున్నరేళ్లలో రైతుల కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఈ 32 నెలల్లో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.90 వేల కోట్లు చెల్లించామని, సన్న ధాన్యానికి బోనస్ అందించామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు యూనిఫాం కుట్టే పనులు అప్పగించడంతో పాటు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేదని విమర్శిస్తూ, ప్రజా ప్రభుత్వంలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు పూర్తి చేశామని, పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని, నిరుద్యోగుల భవిష్యత్తు కోసం వయోపరిమితిలో సడలింపులు కల్పించామని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తామని, ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదైతే పరీక్షలకు సిద్ధం కావాల్సిన బాధ్యత నిరుద్యోగులదని అన్నారు. సెప్టెంబర్‌లో శాసనసభ సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వంలో కుటుంబానికే పదవులు దక్కాయని ఆరోపించిన రేవంత్ రెడ్డి, తమ ప్రభుత్వంలో సామాన్యులు, ఉద్యమకారులు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు పదవులు దక్కాయని, తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ వంటి వారికి మంత్రి పదవులు, కావ్యకు ఎంపీ, యశస్వినికి ఎమ్మెల్యే అవకాశం కల్పించామని చెప్పారు. ఉద్యమకారుడు కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చామని, మహేష్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా చేశామని తెలిపారు. కేసీఆర్ కుటుంబానికే లాభం జరిగిందని, ప్రజా పాలనలో ప్రజలకు లాభం జరుగుతోందని వ్యాఖ్యానించారు. 2029లో రెట్టింపు మెజారిటీతో స్థానిక ఎమ్మెల్యేలను గెలిపించాలని ప్రజలను కోరిన సీఎం, తమది సామాన్యుల కోసం పనిచేసే ప్రభుత్వమని, ప్రజల కోసం ఎంతైనా కష్టపడతానని, వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎంతమంది కేసీఆర్‌లు వచ్చినా తమను ఏమీ చేయలేరని అన్నారు.




# మేడారంలో మహిళా సంఘాల సభ్యులు, భక్తులతో సీఎం రేవంత్ రెడ్డి ఆత్మీయ భేటీ

మేడారం, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — మేడారంలో వనదేవతలు సమ్మక్క–సారలమ్మ గద్దెలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలు, భక్తులను వరుసగా కలుసుకుని వారితో ఆత్మీయంగా మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు, భక్తులు వెల్లడించిన విషయాలను ముఖ్యమంత్రి శ్రద్ధగా విని వారి సమస్యలు, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలు, వారి ఉపాధి అవకాశాలు, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకున్న సీఎం, మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. భక్తులతోనూ మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. మేడారం ప్రాంత అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు స్థానిక మహిళలకు ఉపాధి, ఆర్థిక అవకాశాలను మెరుగుపరిచే అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మేడారంలో వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్ల పంపిణీకి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం



మేడారం, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆగస్టు 17 — ములుగు జిల్లా పర్యటనలో భాగంగా మేడారంలోని వనదేవతలు సమ్మక్క–సారలమ్మ గద్దెలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులో భాగంగా సమ్మక్క–సారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పించి, ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా గిరిజన పూజారులు డోలు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లను పంపిణీ చేసి రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. మేడారానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖ్యమంత్రి మాట్లాడి వారు చేపడుతున్న కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విప్ రామచంద్ర నాయక్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ రావు, నాయని రాజేందర్ రెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మురళి నాయక్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.